ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -114 పేజీలు - 04 వెల - 04/- శనివారం 23 మే 2026

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా


## సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా

కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను

ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా

ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా







**న్యూఢిల్లీ,మే 22,ఆంధ్ర ప్రగతి**
రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మిగతా 2లో...

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఎపిలో 4 స్థానాలతో పాటు పది రాష్ట్రాల్లో ఎన్నిక

జూన్, జులై నెలల్లో ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం

జూన్ 18న పోలింగ్.. అదే రోజున ఫలితాలు

ఏపీలో 4 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే



**న్యూఢిల్లీ ఆంధ్ర ప్రగతి** దేశంలో పది రాష్ట్రాల్లోని 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దేశంలో మొత్తం 10 రాష్ట్రాల్లో 24 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. జూన్ 1న ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపింది. జూన్ 1 నుంచి జూన్ 8 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొంది. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, జూన్ 11న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపింది. జూన్ 18న ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. మిగతా 2లో...

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటీ సీఎం




**అమరావతి,మే 22,ఆంధ్ర ప్రగతి**
అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మిగతా 2లో...

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం...

సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు

రూ.3000 కోట్ల పెట్టుబడితో 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి

పరిశుభ్ర ఇంధన రంగంలో ఏపీ ముందు వరుసలో ఉందని వెల్లడి

రికార్డు సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ బృందానికి అభినందనలు




**జమ్మలమడుగు మే 22,ఆంధ్ర ప్రగతి**
కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (సాజూ) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. "వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. ఈ రోజు, రాయలసీమలో ఎస్ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును మన ప్రజలకు అంకితం చేశాం.రూ.3,000 కోట్ల పెట్టుబడితో కేవలం 11 నెలల రికార్డు సమయంలో ఈ చరిత్రాత్మక మిగతా 2లో...




# హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

విశాఖలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎపి ప్రభుత్వం

లాంఛనంగా ప్రారంభించిన హోంమంత్రి అనిత


**విశాఖపట్నంమే 22,ఆంధ్ర ప్రగతి**
విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. మిగతా 2లో...

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు

రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు

మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు



2లో.

# జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఉపాధి


## ఆదాయానికి కొత్త బాట -మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో 30 శాతం వృద్ధి లక్ష్యం

స్థానిక యువతకు భారీగా ఉద్యోగావకాశాలు



2లో. 4లో.



# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

2లో.

రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష

చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం

తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి

అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో నాలుగేసి స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మూడేసి, జార్ఖండ్‌లో రెండు, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరంలో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21తో వైసిపి నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వాని, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టిడిపి నుంచి ఎంపికైన సానా సతీష్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు ఆయా పార్టీలు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

# హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

మొదటిపేజీ తరువాయి

హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధుల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఈ ఆరోగ్య బీమా ఎంతో సహాయపడుతుందని హోం మంత్రి అనిత వివరించారు.

------------

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్...

## రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష


**అమరావతి,మే 22,ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఏపీలోని కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో, చేపట్టాల్సిన సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటి ద్వారా ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం

**చాందీపూర్,మే 22,ఆంధ్ర ప్రగతి**



స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించే అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోనున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఈ క్షిపణ పరీక్ష జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి దాడి చేసే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఎస్ఎఫ్‌సీ విజయవంతంగా ప్రయోగించి నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షతో అన్ని కార్యాచరణ, సాంకేతిక పరిమితులను విజయవంతంగా ధ్రువీకరించినట్టు పేర్కొంది. గత ఏడాది జూలైలోనూ ఇదేతరహా పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి 700 నుంచి 1,200 కిలోమీటర్ల లక్షాలను సునాయాసంగా ఛేదించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లే శక్తివంతమైన క్షిపణిగా దీనిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. కాగా, ఈనెల మే 8న అడ్వాన్స్ అగ్ని మిజైల్‌ను ఒడిస్సాలోని అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఇండియా విజయవంతంగా పరీక్ష చేసింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టా÷-గ్గ÷టెడ్ రీ-ఎంట్రీ వెహికల్ సిస్టమ్ (ఎంఐఆర్‌వీ)తో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఇండియాకు పెరుగుతున్న ముప్పు అవకాశాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధతను ఎంఐఆర్‌వీ చాటిచెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను ప్రశంసించారు.

---------------

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం...

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. సుస్థిర భవిష్యత్తు పట్ల మాకున్న తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనం. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు మాకు ఎంతో గర్వకారణం.ఈ ప్రాజెక్టును ఇంత తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ ఇండియా బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా మన ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, కొత్త అవకాశాల రూపంలో గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తాయని నేను మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

మొదటిపేజీ తరువాయి

ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

**తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు**

**రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు**

**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

**అమరావతి,మే 22,ఆంధ్ర ప్రగతి**



మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

# విజ్ఞాన్ యూనివర్సిటీ-ఐఎండీ కీలక ఒప్పందం...

**ఏపీ రైతులకు అత్యాధునిక వాతావరణ సేవలు**

**అమరావతి,మే 22,ఆంధ్ర ప్రగతి**



ఆంధ్రప్రదేశ్ రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. అత్యాధునిక, కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని పొలం స్థాయిలోనే రైతులకు అందించేందుకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ)తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలను ఢిల్లీలో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి. కృష్ణ కిషోర్, ఐఎండీ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ మార్చుకున్నారు.

ఈ ఒప్పందం ప్రకారం, ఐఎండీ తమ వద్ద ఉన్న అత్యంత కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని 1-2 కిలోమీటర్ల పరిధిలో ఏపీఐల ద్వారా విజ్ఞాన్ యూనివర్సిటీకి అందిస్తుంది. ఈ డేటాను విశ్లేషించి, పంటల ప్రణాళిక, నీటిపారుదల యాజమాన్యం, పురుగుమందుల వాడకం, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడం వంటి అంశాలపై విజ్ఞాన్ రైతులకు నిర్దిష్ట సలహాలు, సూచనలు అందిస్తుంది.

ఈ భాగస్వామ్యం ద్వారా వాతావరణ శాస్త్ర పరిజ్ఞానాన్ని వ్యవసాయ పరిశోధనలతో అనుసంధానం చేస్తున్నామని విజ్ఞాన్ వీసీ ప్రొఫెసర్ కృష్ణ కిషోర్ వివరించారు. దీనివల్ల వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వంటి సవాళ్లను రైతులు సమర్థంగా ఎదుర్కోగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ఒప్పందంతో వాతావరణ శాస్త్రం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో పరిశోధనలకు, విద్యా కార్యక్రమాలకు ప్రోత్సాహం లభిస్తుందని నరసరావుపేట ఎంపీ, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల మధ్య శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులకు కూడా ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించడం సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఉపాధి

**కర్నూలు ఆంధ్ర ప్రగతిమే 22)**



రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేసి సంపద సృష్టితో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను మంత్రి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కలిసి సందర్శించి గనుల తవ్వకాలు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను పరిశీలించారు.

మంత్రి మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక సాంకేతిక పద్ధతులు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు తవ్వకాల అవకాశముందని చెప్పారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు 30 కిలోల వరకు ఉత్పత్తి జరుగుతోందన్నారు.జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు తెలిపారు. దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో జొన్నగిరి మైన్ ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. అలాగే విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్వార్ట్జ్ ఆధారిత విలువ ఆధారిత పరిశ్రమలు, సోలార్ ప్యానెల్ తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గ్రానైట్ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించే అవకాశం ఉందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో సరైన ప్రోత్సాహం లేక ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పించడంతో గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఇప్పటికే 300 నుంచి 400 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు లభించాయని, వలసలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు.గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే మరింత పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాముల డోర్ లాక్ సీళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 22:**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాసపు తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఈవీఎంల గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల డోర్ లాక్ సీళ్ల స్థితిని పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న కలెక్టర్, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ లాగ్‌బుక్‌ను పరిశీలించి, విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరును పరిశీలించిన కలెక్టర్, అగ్నిమాపక పరికరాల అందుబాటు మరియు వాటి పనితీరుపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. డోర్ లాక్ సీళ్ల భద్రతా అంశాలను పరిశీలిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి 27 వేల ఆర్థికసహాయం

**-శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవ చారిటబుల్ ట్రస్ట్ సహాయం.**




**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల మే 22:** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు మరియు ప్రభావతమ్మ దంపతులు శుక్రవారం పేద కుటుంబానికి 27 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోటపాడు గ్రామానికి చెందిన కేడం మద్దిలేటి అనారోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఖర్చులకు మరియు మద్దిలేటి కుమార్తె విద్యాభ్యాసానికి ఈ ఆర్థిక సహాయం చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా తండ్రి అనారోగ్య పరిస్థితుల కారణంగా బాలికా విద్యకు అంతరాయం ఏర్పడకూడదన్న సదుద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో చేసిన ఈ సేవాభావం పట్ల కోటపాడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# జొన్నరైతు సమస్యలు జాయింట్ కలెక్టర్ దృష్టికి.

**-జొన్నలు ఆలస్యం చేయకుండా కొనుగోలుచేయాలి.**

**-మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**

నంద్యాల పార్లమెంట్ లోని జొన్న రైతుల సమస్యలు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ దృష్టికి మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి తీసుకొని వెళ్ళారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ నీ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జొన్న రైతులు పడుతున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు.పార్లమెంటు పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జొన్న రైతులు వేర్ హౌస్ గోడౌన్ వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు.గత మూడు రోజులుగా రైతులు వస్తున్నా రైతులకు సంబంధించిన జొన్నలు త్వరితగతిన అన్లోడ్ కావడంలేదని అన్నారు.ప్రభుత్వం రైతులు పండించిన జొన్నలు అన్ని కొనుగోలు చేసేవిధంగా చేయాలన్నారు.అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని కోరారు. రైతులకుజూ సంబంధించిన జొన్నలు 10 వేల టన్నులు ప్రభుత్వ అనుమతితో కొనుగోలు చేయాలని విగ్నేప్తి చేశారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణాపురంకు చెందిన సీనియర్ రైతు నాయకులు బాలిశ్వర రెడ్డి,నంద్యాల కు చెందిన రామ కృష్ణా రెడ్డి,పాణ్యం కు చెందిన మురళీధర్ రెడ్డి,గడివేములకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి ,ఇతర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# అహోబిలంలో గాలివాన బీభత్సం..

## మామిడి పంటకు తీవ్ర నష్టం.

**..మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 22:**



అహోబిలం ప్రాంతంలో నిన్న రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షానికి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలివాన ధాటికి తోటల్లో ఉన్న మామిడికాయలు భారీగా నేలరాలాయి.స్థానిక తోట యజమాని, రిటైర్డ్ తహసీల్దార్ ఏసీ సుబ్బరాయుడు మాట్లాడుతూ తన మామిడి తోటలో సుమారు మూడు టన్నుల మామిడికాయలు నేలరాలిపోయాయని తెలిపారు. ఈ ఘటనతో దాదాపు రూ.2 లక్షల మేర పంట నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో గాలివానతో మరింత నష్టం జరిగిందన్నారు. ఉద్యాన శాఖ అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించాలని కోరారు.అకాల వర్షాలు, ఈదురుగాలులతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జనాభా గణనను వేగవంతంగా పూర్తి చేయాలి

**-..సెన్సస్ డైరెక్టర్ నివాస్.**

**..నంద్యాల జిల్లాలో 83.26 శాతం జనాభా గణన పూర్తి : కలెక్టర్ రాజకుమారి.**

**వలస కార్మికులు, హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 22:**

జిల్లాలో జనాభా గణన ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సెన్సస్ డైరెక్టర్ నివాస్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి జనాభా గణన పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఆర్ఓ రామునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభా సుమారు 21.36 లక్షలుగా నమోదవుతుండగా, ఇప్పటివరకు 83.26 శాతం గణన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల అంచనాల ప్రకారం జిల్లా జనాభా సుమారు 19.13 లక్షలుగా ఉండగా, గ్రామ/వార్డు సచివాలయాల డేటా ప్రకారం అది 20 లక్షల వరకు ఉండే అవకాశముందని వివరించారు. పాణ్యం మండలంలో జనాభా గణనలో వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాలతో పాటు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు మరియు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా, నంద్యాల పట్టణం బ్యాంకింగ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది విద్యార్థులు, అభ్యర్థులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. దీంతో కొంత సమాచారం ఇంకా నమోదు దశలో ఉన్నట్లు వెల్లడించారు.

వలస కార్మికులు, చిన్నారులు, లేబర్ కాలనీలు, నిర్మాణ ప్రాంగణాల్లో నివసిస్తున్న కుటుంబాలు సాధారణ జి ఎస్ డబ్ల్యూ ఎస్ పరిధిలోకి రాకపోయే అవకాశమున్నందున, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సెన్సస్ డైరెక్టర్ సూచించారు. గుంటూరుఅమరావతి ప్రాంతాల్లో అమలు చేసిన విధానాలను ఆదర్శంగా తీసుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే, లాక్ చేసి ఉన్న ఇళ్లను తిరిగి సందర్శించి వివరాలను సేకరించడంతో పాటు, ఎవరూ మిగిలిపోకుండా జనాభా గణన ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**..ప్రతి శుక్రవారం ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమ నిర్వహణ.**

**.. పాణ్యం నియోజవర్గానికి సంబంధించి ప్రజా సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 22:**

ప్రతి నియోజకవర్గంలో "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమాన్ని 4 సార్లు నిర్వహించి ప్రజల నుండి అర్జీలు తీసుకుని పరిష్కరించడం జరుగుతుందని, వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.


శుక్రవారం "ఒక్క నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం రెండవ సందర్శనకు సంబంధించి స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో రెండవ విడత సందర్శన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. మొదటి విడత సందర్శన లో స్వీకరించిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫైనాన్షియల్ అంశాలకు సంబంధించిన అర్జీలపై అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని, అమలు సాధ్యం కాని అర్జీలకు "నాట్ ఫీజిబుల్"గా స్పష్టమైన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరిష్కరించగలిగే అర్జీలపై వెంటనే చర్యలు తీసుకుని సంబంధిత ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. వచ్చే శుక్రవారం నిర్వహించే మూడవ విడత పర్యటనలో రెండవ విడతలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఆర్డర్లు, ఎండార్స్‌మెంట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలపై తీసుకున్న చర్యలు ప్రజలకు కనిపించేలా డిస్ప్లే చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలు, ముఖ్యంగా బ్రిడ్జిలు, రోడ్లు వంటి ఆర్థిక సంబంధిత అభ్యర్థనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని తెలియజేస్తే, తమ పిటిషన్ పురోగతి ఏ దశలో ఉందో అర్జీదారులకు స్పష్టత వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పారదర్శకత మరింత పెరుగుతుందన్నారు. పరిష్కరించలేని అర్జీల విషయంలో కూడా స్పష్టమైన కారణాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. "ఈ కారణాల వల్ల పని చేయలేము", "ఇది సాధ్యం కాదు" లేదా "ప్రభుత్వానికి పంపిస్తున్నాం" వంటి క్లారిటీ ఇవ్వడం ద్వారా అర్జీదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ప్రతి అర్జీదారుకు తప్పనిసరిగా స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నాల్గవ విడత పర్యటనలో గత మూడు విడతలలో పరిష్కరించిన గ్రీవెన్సెస్‌ను డిస్ప్లే చేయడంతో పాటు, పరిష్కరించలేని అర్జీలకు సంబంధించిన కారణాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చిన అనంతరం, అందజేసిన కాపీకి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను అధికారులు భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కృష్ణ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డా.కామేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డి ఆర్ డి ఏ పిడి రమణా రెడ్డి, డ్వామా పిడి నరసింహా రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీ లను పూర్తిగా నివారించాలి.

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు ,మే 22:**జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ లో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణ పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంకా బాల్యవివాహాలు,టీనేజీ ప్రెగ్నెన్సీ లు నమోదు అవుతున్నాయని, వీటిపై నిరంతరం నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ , ఏఎన్ఎం, ఆశ సిబ్బంది వారి పరిధిలో కౌమార దశలో ఉన్న బాలికలను, వారి తల్లిదండ్రులతోనూ సంప్రదిస్తూ బాల్య వివాహాలు చేయకుండా, టీనేజ్ గర్భం దాల్చకుండా వారికి సరైన సూచనలు చేయాలని,ఇందువల్ల జరిగే దుష్పరిణామాలను వివరించాలని ఆదేశించారు. అమ్మాయిలు చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన జరిగే నష్టాలను, ఇబ్బందులను కర్నూలు జిల్లా వైద్య విద్యార్థినుల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో ను, ఫోన్ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ ను ఆదేశించారు.బాల్య వివాహాలు జరగకుండా, టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదు కాకుండా చైతన్యం తీసుకు వచ్చేలా కళాజాత బృందాలను, బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార రథము, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఐసిడిఎస్ పిడి విజయ ను ఆదేశించారు.

సమావేశంలో కర్నూలు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా , డిఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , ఐ సి డి ఎస్ పిడి విజయ పాల్గొన్నారు.

# కేసుల నిరూపణతోనే బాధితులకు నిజమైన న్యాయం.

**..పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్.**

**..నేరస్తులకు శిక్ష పడేలా కేసుల దర్యాప్తు చేపట్టాలి.**

**..ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు...**

**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 22:**

నంద్యాల జిల్లాఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు మరియు నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అధికారులతో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు ఆద్వర్యంలో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు, సాక్ష్యాధారాల ప్రవేశం, మరియు నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్రపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం జరగాలన్నా, సమాజంలో నేరాల శాతం తగ్గాలన్నా కోర్టులలో కేసుల నిరూపణ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఎంత కష్టపడి దర్యాప్తు చేసినప్పటికీ... కోర్టులో సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి, కేసును నిరూపించి, నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం జరుగుతుంది. ఆ మహత్తర బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లపైనే ఉంది."అన్నారు.పోలీస్ అధికారులు ప్రతి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టడం, ప్రభుత్వ లాయర్లతో సమన్వయం చేసుకోవడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

కోర్టులో కేసుల గురించిన సమాచారం ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు తెలుసుకొని కోర్టు కానిస్టేబుల్ లను నిరంతరం గైడ్ చేస్తూ ఉండాలన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నిందితులకు శిక్షలు పడేలా నిజాయితీగా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లను గుర్తించి, వారికి తగిన రివార్డులు మరియు ప్రశంసా పత్రాలతో ప్రోత్సహిస్తామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించినా, చట్టాన్ని అతిక్రమించినా లేదా నేరస్థులకు అనుకూలంగా వ్యవహరించినా ఎంతటి వారినైనా సహించేది లేదు. అలాంటి వారిపై శాఖాపరమైన కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవు. ఈ సమావేశంలో నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం.జావళి,కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, మరియు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన అదికారులు కోర్టు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మైనింగ్ ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం.

## -జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు/తుగ్గలి మే, 22:** మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు కలిసి సందర్శించారు. గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.... జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక యంత్రాంగం, నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ఈ గోల్డ్ మైన్ దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. త్వరలోనే అక్కడి ప్రక్రియలను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో మైనింగ్ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖనిజ సంపదను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని, చైనాకు పోటీగా నిలిచే స్థాయిలో మన దేశంలో ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. అలాగే రాష్ట్రంలో లభించే గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను ముఖ్యమంత్రి త్వరలో సందర్శించే అవకాశముందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. భవిష్యత్తులో మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి మరింత ఆదాయం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ**
**యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆదాయం.**
**: పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు.**

జొన్నగిరి గోల్డ్ మైన్ సందర్శన సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. అప్పటి పాలకుల వైఖరి కారణంగా సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొని, తటస్థ ధోరణిలో కొనసాగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని చెప్పారు. జొన్నగిరి గోల్డ్ మైన్ ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటికే 300 నుండి 400 మందికి పైగా స్థానిక యువతకు, విద్యావంతులకు, కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఎండాకాలంలో వలసలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగా ఉపాధి లభిస్తూ వలసలను తగ్గించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు వంటి కీలక అంశాలు అప్పటి ఉప ముఖ్యమంత్రి కే.ఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో గోల్డ్ ప్రొడక్షన్ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని, దాంతో మరింత పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, ప్రాంతానికి ఆర్థికాభివృద్ధి, రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చే ఈ ప్రాజెక్ట్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇంచార్జ్) నాగిని, డి.ఎస్.పి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు

## గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.

**ఆంధ్ర ప్రగతి ఆదోని మే 22:**



ఆదోని పట్టణం, వసంత టాకీస్ సమీపంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం వత్ససహిత గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిసినవి. ప్రతిరోజు ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు మహేంద్రకర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు జె. ఈశ్వరరావు, కార్యదర్శి జవేల్కర్ బాబురావు, సంయుక్త కార్యదర్శి జె. వెంకటేశ్వరరావు, కోశాధికారి పతంగి నరసింగరావు, వడే రఘు, సూత్రవే ఆనంద్, సరోదే వెంకోబరావుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎల్ నినో పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు మే 22:**కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎల్ నినో పరిస్థితిని ఎదుర్కొని విజయవంతంగా వ్యవసాయం చేసే ప్రకృతి వ్యవసాయ విధానాలు మరియు పద్ధతుల గురించిన పుస్తకం ను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరితమ కార్యాలయం లో ఎల్ నినో పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ రైతులందరూ పూర్తిస్థాయిలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా రైతులకు ఒకే రకమైన పంట కాకుండా పలు రకాల పంటలు వేసుకొనే విధంగా అవగాహన కల్పించి రాబోయే ఖరీఫ్ సీజన్లో మంచి దిగుబడిలో వచ్చేల అవగాహన కల్పించాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి శ్రీమతి పి.ఎల్. వరలక్ష్మీ, ప్రకృతి వ్యవసాయ జిల్లా డిపిఎం శ్రీమతి ఏ. మాధురీ, డిఎల్ఎంపి లక్ష్మయ్య మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంజుమన్ సంస్థ ద్వారా ఇచ్చే స్కాలర్షిప్స్ ధరఖాస్తులు ఆహ్వానం.

**-ముస్లిం విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోండి. - నశ్యం అబ్దుల్ ఖుద్దూస్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ మే 22:**



గత పదిహేనేళ్ళగా ఇస్తున్నట్లే ఈ విద్యా సంవత్సరం (2025 –26) పదవతరగతి లో ఉత్తీర్ణత సాధించిన నంద్యాల పరిధిలోని ముస్లిం మైనార్టీ విద్యార్థులకు అంజుమన్ సంస్థ ద్వారా ప్రతి విద్యార్థికి రూ.3000/– స్కాలర్షిప్ ఇస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ సంవత్సరం పదవతరగతి పాస్ అయి, ఉన్నత చదువులకు వెళ్ళబోయే ముస్లిం మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని శ్రీ ఖుద్దుస్ కోరారు. అంజుమన్ సంస్థ ముస్లింల కోసం చేసే సేవలో ఇదొకటని ఆయన అంజుమన్ సేవలు తెలిపారు. ఆర్టిసి బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ సంస్థలో ఉచితంగా లభించే దరాఖాస్తు ఫారంలో పూర్తి వివరాలు నింపి ఆధార్ కార్డు,10వ తరగతి మార్క్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, కళాశాలలో చేరిన ధృవీకరణ పత్రం, రెండు ఫోటోలు జతచేసి జూన్ 20వ తేది లోపు పూర్తి చేసిన దరఖాస్తులను అంజుమన్ సంస్థ లో అందజేయాలన్నారు. స్కాలర్షిప్ పంపిణి తేది తదనంతరం ప్రకటించబడును.ఎన్.ఏ.ఖుద్దూస్అధ్యక్షులు అంజుమన్, నంద్యాల.9866242724

# ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి.

**..హెచ్ఐవి బాధితులు ఎవరూ చికిత్స మధ్యలో మానేయకుండా చర్యలు తీసుకోవాలి.**

**..ఏఆర్టి సేవలను మరింత బలోపేతం చేయాలి.**

**..హెచ్ఐవీ బాధితులకు వైరల్ లోడ్ పరీక్షలు 99 శాతం పూర్తి చేయాలి.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 22:** జిల్లాలో హెచ్ఐవి నిర్ధారణ, చికిత్స మరియు నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్య అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ అంశం పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి బాధితులు ఎవరూ చికిత్స మధ్యలో మానేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. హెచ్ఐవి చికిత్సను నిలిపివేసిన వారిని తిరిగి చికిత్సలోకి తీసుకురావడానికి ఇంటి సందర్శనలు, ఫోన్ ఫాలోఅప్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్టిగ్మా కారణంగా బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్న వారిని ప్రత్యేకంగా కలిసి అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఐవి బాధితులకు నిరంతరాయంగా చికిత్స అందేలా చూడాలని, మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఏఆర్టి సిబ్బంది, గ్రామీణ స్థాయి ఆరోగ్య సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మొబైల్ వాహనాల ద్వారా కూడా అవసరమైన మందులను బాధితులకు చేరవేయాలన్నారు. హెచ్ఐవి నియంత్రణలో మొదట 95 లక్ష్యాల సాధనలో జిల్లా ఇప్పటికే మొదటి లక్ష్యాన్ని చేరుకుందన్నారు. వంద మందిలో 95 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి మొదటి స్థానం జిల్లా సాధించిందన్నారు. అయితే రెండో 95 లక్ష్యంలో ఇంకా పురోగతి అవసరమని, ముఖ్యంగా చికిత్స మధ్యలో నిలిపివేసిన బాధితులను తిరిగి చికిత్సలోకి తీసుకురావడం అత్యంత కీలకమన్నారు. ప్రస్తుతం చికిత్సను నిలిపివేసిన బాధితులను తిరిగి చేర్చేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ లక్ష్యాలను సాధిస్తే కర్నూలు జిల్లా రాష్ట్రంలో ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. హెచ్ఐవి పరీక్షలు, మందులు మరియు ఇతర వైద్య సేవల్లో ఎలాంటి కొరత లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో హెచ్ఐవీ చికిత్స పొందుతున్న ప్రతి బాధితుడికి వైరల్ లోడ్ రక్త పరీక్షలు నిర్వహించి, మందులు సక్రమంగా వినియోగిస్తున్నారో లేదో నిర్ధారించాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ లోడ్ పరీక్షల లక్ష్యం 99 శాతం కాగా, ఇప్పటికే 96.8 శాతం పురోగతి సాధించామని, మిగిలిన లక్ష్యాన్ని కూడా సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర స్థాయి నుంచి వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుకుమార్, డిఎంహెచ్ఓ డా.కామేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి, జిల్లా లేప్రసీ అధికారి డా.భాస్కర్ రాజు, ఐసిడిఎస్ పిడి విజయ, డిసిహెచ్ఎస్ డా.జాఫ్రుల్లా, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి తులసి దేవి, ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో మరణించిన చర్చిల్ కుటుంబానికి 5 లక్షల పార్టీ బీమా చెక్కు అందజేత.

**..స్పందించి అండగా నిలిచిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, యువ నాయకులు ఫిరోజ్, ఫయాజ్, వార్డు ఇంచార్జ్ జోసెఫ్.**

**..పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం: మంత్రి ఫరూక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**



నంద్యాల పట్టణ పరిధిలోని 33వ వార్డు జ్ఞానాపురానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చర్చిల్ కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. గత మార్చి 8వ తేదీన జరిగిన ఒక దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో చర్చిల్ అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని 33వ వార్డు టీడీపీ ఇంచార్జ్ జోసెఫ్ వెంటనే మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, మరియు యువ నాయకులు ఫిరోజ్, ఫయాజ్ గార్ల దృష్టికి తీసుకువెళ్లారు. అప్పట్లో చర్చిల్ గారి పార్థివ దేహానికి నివాళులర్పించిన నాయకులు, బాధిత కుటుంబానికి తామున్నామనే భరోసా ఇచ్చారు. మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు వార్డు ఇంచార్జ్ జోసెఫ్ గారు చర్చిల్ గారికి సంబంధించిన టీడీపీ సభ్యత్వ పత్రాలను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించి, ప్రమాద బీమా కోసం దరఖాస్తు చేశారు. పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమాను మంజూరు చేసింది. మే 22వ తేదీన ఈ బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కును మంత్రి ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. కష్టం వచ్చిన వెంటనే స్పందించి, మంగళగిరి పార్టీ ఆఫీస్ ద్వారా బీమా సొమ్ము త్వరగా అందేలా కృషి చేసినందుకు గాను... మృతుడి కుటుంబ సభ్యులతో పాటు మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారికి, యువ నాయకులు ఫిరోజ్, ఫయాజ్ కి,33వ వార్డు ఇంచార్జ్ జోసెఫ్ గార్లకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టకాలంలో పార్టీ తమను ఆదుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవల్సిన భాధ్యత అందరిది.

## -సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి. -మే 22 - అంతర్జాతీయ జీవవెవిధ్య దినోత్సవం.

**ఆంధ్ర ప్రగతి డోన్ మే 22:**
ప్రస్తుతం మానవుడు జీవన పరిస్థితులను, పర్యావరణ ప్రక్రియలను ఉల్లంఘిస్తుండటం వల్ల మన జీవన శైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. ఎన్నో జీవ జాతులు అంతరించిపోతున్నాయి. అందువల్ల వాటి ప్రాముఖ్యతను తెలియజేయడానికి మే 22 - అంతర్జాతీయ జీవవెవిధ్య దినోత్సవాన్ని నిర్వహించి అవగాహణ కల్పిస్తుందని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. జీవ వైవిధ్యానికి మూలం ప్రకృతి. అద్భుతమైన వివిధ రకాల మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవుల సమ్మేళనంతో కలిగి ఉంటుంది. ప్రకృతిలోని అన్ని సమతుల్యతలను మనిషి పాటించాలి. లేకపోతే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రకృతిని మనం సంరక్షిత్తే అది మనల్ని కాపాడుతుంది. ప్రకృతిలో జీవ వైవిధ్య అసమతుల్యత


పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

వల్లనే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోలేకపోతే భవిష్యత్‌లో అనేక సమస్యలను మానవాళి ఎదుర్కొవాల్సి వస్తుందని సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. మానవ జీవన శైలిని మార్చుకోవాలి. రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి. జంతువుల్ని, మొక్కల్ని పరిరక్షించుకోవాలి. చాలా మంది జంతువుల చర్మాలతో చేసే వస్తువుల్ని వాడుతుంటారు. దీన్ని మానుకోవాలి. విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాలి. ఉన్న మహ వృక్షాలను కాపాడాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. సృష్టిలో ప్రతి జీవరాశిని బ్రతనివ్వాలి. వాటిని కాపాడుకోవాలి. భూమిపై జీవరాశులను, వృక్ష సంపదను కాపాడుకోవడమే అసలైన జీవ వైవిద్యమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# మే 31 మహాసభను జయప్రదం చేయండి.

## --రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**
ఈ నెల మే 31న నంద్యాలలో నిర్వహించనున్న 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' 10వ వార్షికోత్సవ మహాసభ విజయవంతానికై రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, సంతజూటూరు, బండిఆత్మకూరు గ్రామాలలో సమితి కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు గార్లు విస్తృతంగా పర్యటించారు. అక్కడి రైతాంగంతో సమావేశమై రాయలసీమ ఎదుర్కొంటున్న తీవ్ర సాగునీటి సమస్యలపై అవగాహన కల్పించారు. మే 31న జరిగే మహాసభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమితి నాయకులు



రాఘవేంద్రగౌడ్, పట్నం రాముడు మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, పాలకుల వైఫల్యాల వల్లే నేడు సాగునీటి హక్కులు ఉండి కూడా రైతాంగం కరవు బారిన పడాల్సి వస్తోందని మండిపడ్డారు.
రాయలసీమలో పండే ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలకు సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం వల్ల రైతులు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వందేళ్ళ చరిత్ర వున్న కెసి కెనాల్ స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016 మే 31న 30,000 మందితో సాగిన 'సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' స్ఫూర్తితో.. రాయలసీమ ఆత్మగౌరవాన్ని, హక్కులను చాటిచెప్పడానికి నంద్యాలలో జరిగే 10వ వార్షికోత్సవ మహాసభ ఒక వేదిక కానుందని సమితి నాయకులు స్పష్టం చేశారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ తో నంద్యాల నగరానికి నూతన శోభ.

**..రేపటి నుంచి నెలరోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్.**

**..గాంధీ చౌక్‌లో తొలి కార్యక్రమం.**

**ప్రజలు భాగస్వామ్యం కావాలి.**

**..మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**
నంద్యాల పట్టణాన్ని పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. గౌరవ మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ గారు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నాలుగు వారాలపాటు నాలుగు విభిన్న అంశాలపై ఈ




కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిలో భాగంగా రేపు ఉదయం 6.00 గంటలకు గాంధీ చౌక్ కూరగాయల మార్కెట్ వద్ద »»Red/Yellow Spots, Roads Ê Visible Cleanliness Driveµ' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు.
పట్టణంలోని చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, ప్రధాన రహదారులు, మార్కెట్ పరిసరాల్లో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.
నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వ్యాపారులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ వాసులు అందరూ సహకరించాలని కమిషనర్ బి. శేషన్న కోరారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతినిధులు హాజరై సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అర్ధరాత్రి 'బోల్డ్'చాటింగ్..

## బాధ్యత మరిచిన ఇల్లాలు.! ..నేటి సమాజంలోపెరుగుతున్న బ్లాక్‌మెయిల్ కేసులు.


ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకున్న స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ప్రపంచాన్నే చుట్టేయొచ్చు. కానీ, అదే ఫోన్ కొన్నిసార్లు నిండు సంసారాల్లో చిచ్చు పెడుతోంది. కష్టాల్లో ఉన్నప్పుడు కుటుంబానికి అండగా నిలవాల్సిన విచక్షణను హరించి వేస్తోంది. నగరంలో ఇటీవల వెలుగుచూస్తున్న కొన్ని క్రైమ్ సంఘటనలు, కౌన్సిలింగ్ సెంటర్లకు వస్తున్న కేసులు చూస్తుంటే సమాజం ఎటు వైపు వెళ్తోందనే ఆందోళన కలగక మానదు.
తాజాగా వెలుగులోకి వస్తున్న డిజిటల్ క్రైమ్ మూలాలు పరిశీలిస్తే.. 40 దాటిన కొందరు మహిళలు క్షణికానందం కోసం, 'నా క్వాలిటీ టైమ్' అనే భ్రమలో పడి జీవితాలను ఎలా రోడ్డున పడేసుకుంటున్నారో స్పష్టమవుతోంది.

### బాధ్యత మరిచిన అర్ధరాత్రి చాటింగ్‌లు

రాత్రి ఒంటిగంట దాటింది.. ఇంట్లో భర్త తీవ్ర అనారోగ్యంతో మంచానపడ్డాడు. పక్కనే పిల్లలు రేపటి భవిష్యత్తుపై నమ్మకంతో నిద్రపోతున్నారు. ఆ సమయంలో వారికి ధైర్యం చెప్పి, అండగా ఉండాల్సిన 45 ఏళ్ల ఇల్లాలు.. ఫోన్ పట్టుకుని అపరిచితులతో 'బోల్డ్', 'అడల్ట్' చాటింగ్‌లలో మునిగిపోవడం ఏ రకమైన సంస్కృతి? 45 ఏళ్లు అంటే జీవితంపై పూర్తి అవగాహన రావాల్సిన వయసు. టీనేజ్‌లో ఉన్న పిల్లలకు తల్లి ప్రవర్తనే రోల్ మోడల్. అలాంటిది అర్ధరాత్రి పూట పరాయి వ్యక్తులతో శృంగార సంభాషణలు చేయడం కుటుంబానికే కాదు, ఆమె వ్యక్తిత్వానికి తీవ్ర నష్టం చేకూరుస్తోంది. ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించదగిన విషయం కాదు.

### హైదరాబాద్‌లో నెలకు 10కి పైగా కేసులు!


ఆన్‌లైన్ వేదికగా సాగే బోల్డ్ చాటింగ్‌లు ఎప్పటికీ ప్రైవేట్ కావు అనే కనీస నిజాన్ని సదరు మహిళలు గ్రహించలేకపోతున్నారు. అవతలి వ్యక్తి ఫేక్ ప్రొఫైల్ కావచ్చు లేదా సైబర్ నేరగాడు కావచ్చు. స్క్రీన్‌షాట్లు, స్క్రీన్ రికార్డింగ్‌లు: చాటింగ్ సమయంలో షేర్ చేసే ఫొటోలు,



వీడియోలు, సంభాషణలు క్షణాల్లో రికార్డ్ అవుతాయి.
బ్లాక్‌మెయిల్ దందా:"మీ భర్తకు చూపిస్తాం, బంధువులకు పంపుతాం" అంటూ లక్షలాది రూపాయలు డిమాండ్ చేసే ముఠాలు నగరంలో పొంచి ఉన్నాయి.
పరువు గాల్లోకి: హైదరాబాద్ నగరంలోనే నెలకు సగటున 10కి పైగా ఇలాంటి బ్లాక్‌మెయిల్ కేసులు సైబర్ క్రైమ్ పోలీసుల వరకు వస్తున్నాయి. కేవలం రెండు నిమిషాల చాటింగ్ ముచ్చట.. 20 ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన కుటుంబ పరువును బజారున పడేస్తోంది

### ఒంటరితనానికి తప్పుడు దారే పరిష్కారమా?

భర్తకు ఆరోగ్యం బాగోలేనప్పుడు భార్య మానసిక ఒత్తిడికి, డిప్రెషన్‌కు లోనవడం సహజమే. కానీ దానికి పరిష్కారం పరాయి మగవాళ్లతో అర్ధరాత్రి సెక్స్ చాట్ చేయడం కాదు.
సమస్యలు ఉన్నప్పుడు వివేకంతో ఆలోచించాలి. ఒంటరితనం అనిపిస్తే పుస్తకాలు చదవడం, దైవచింతన, స్నేహితులతో మాట్లాడడం లేదా అవసరమైతే సైకాలజిస్ట్‌ను కలిసి కౌన్సిలింగ్ తీసుకోవాలి. అంతే తప్ప, దారి తప్పి 'నాకు వేరే ఆప్షన్ లేదు' అనడం స్వయంకృత అపరాధమే అవుతుంది." అని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనిషిని జంతువు నుంచి వేరు చేసేది విచక్షణే. శారీరక కోరికలు, మానసిక ఒత్తిళ్లు అందరికీ ఉంటాయి. కానీ పెళ్లి అనే పవిత్ర వ్యవస్థకు, కుటుంబ




బంధాలకు కట్టుబడి ఉండడమే నిజమైన సంస్కారం. భర్త నీడలో ఉంటూ, ఆయన తిండి తింటూ, ఆయన నిద్రపోయాక వెనకనుంచి ఇలాంటి ద్రోహానికి ఒడిగట్టడం క్యారెక్టర్‌కే మచ్చ.

### పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం

తల్లి రాత్రి పూట మేల్కొని ఫోన్ చూస్తూ నవ్వుతుంటే టీనేజ్ పిల్లలు గమనించకుండా ఉంటారా? తల్లి ప్రవర్తననే పిల్లలు ఆదర్శంగా తీసుకుంటారు. రేపు వారు కూడా ఇదే బాట పడితే తప్పు ఎవరిది? ఇల్లు చక్కదిద్దాల్సిన తల్లే తప్పుదారి పడితే ఆ కుటుంబం పూర్తిగా చిన్నాభిన్నమైపోతుంది.

### సానుభూతి కాదు.. సరిదిద్దడం ముఖ్యం!

మారుతున్న సమాజాన్ని సాకుగా చూపి తప్పును ఒప్పు చేయలేం. తప్పు ఎప్పటికీ తప్పే. కష్టాలు వచ్చాయని తప్పుడు దారిని ఎంచుకునే లాజిక్‌ను సమాజం అంగీకరించదు. ఒకవేళ భర్తతో కలిసి జీవించలేని పరిస్థితి ఉంటే ధైర్యంగా విడాకులు తీసుకుని గౌరవంగా బతకాలి. అంతే కానీ, ఒకే ఇంట్లో ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడడం క్షమార్హం కాదు.
ఇలాంటి ఇల్లాళ్లు ఇకనైనా ఫోన్ పక్కన పెట్టి.. మంచాన ఉన్న భర్తకు మందు ఇచ్చి, పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడమే సంస్కారం. సైబర్ ముఠాల చేతిలో చిక్కి జీవితాలను నాశనం చేసుకోకముందే విచక్షణతో వ్యవహరించడం ఎంతో అవసరం.

# టంగుటూరు వద్ద ఉన్న బ్రిడ్జ్ పునః నిర్మాణం చేయాలి.

**-వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా అరికట్టాలి.**

**..సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**
నంద్యాల నుండి బనగానపల్లెకు వెళ్తున్న రాస్తాలో టంగుటూరు దగ్గర ఉన్న బ్రిడ్జిని తక్షణమే పునర్ నిర్మించాలని బనగానపల్లె సిపిఐ మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామం ముందు తర్వాత ఉన్న బ్రిడ్జిలను పునర్నిర్మాణం చేయాలని రాబోయే వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా చూడాలని బనగానపల్లె నుండి జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే బ్రిడ్జిలు అడుగున ఉండడంవల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు అలాగే బైక్స్ కార్లు సైలెన్సర్ లో నీళ్లు వెళ్లి తీవ్రంగా నష్టపోతున్నారు వర్షాలు ఎక్కువైతే గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగి తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు రైతులు పొలాలకు వెళ్లాలంటే విద్యార్థులు స్కూల్ కి వెళ్లాలంటే ఈ బ్రిడ్జి గుండా చేరుకోవాలి కావున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీగా గౌరవ శాసనసభ్యులు రోడ్లు భవనాల శాఖ మంత్రి గౌరవ బీసీ జనార్దన్ రెడ్డి కి ఈ కల్వర్టులను తొందరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి పాల్గొన్నారు

# అస్వస్థతకు గురైన హుస్సేన్‌ను పరామర్శించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు , నంద్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అనుచరుడు, తెలుగుపేటకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు హుస్సేన్ ను శనివారం నంద్యాలలోని శాంతిరామ్ జనరల్ హాస్పిటల్‌లో పరామర్శించారు. టీడీపీ సీనియర్ నేత హుస్సేన్ గారు అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ కు గురై శాంతిరామ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారనే విషయం తెలుసుకున్న మంత్రి వర్యులు ఫరూక్ గారు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ఐసీయూ లో చికిత్స పొందుతున్న హుస్సేన్‌ను మంత్రి ఫరూక్ గారు డాక్టర్లను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అక్కడి వైద్యులను ఆదేశించారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ హుస్సేన్ పార్టీకి, నాకు అత్యంత ఆప్తుడు, నమ్మకమైన కార్యకర్త అని ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు . ఆయన కుటుంబానికి పార్టీ మరియు నేను అన్ని విధాలా అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదు" అని ధైర్యం చెప్పారు. మంత్రి తో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు మిద్దె ఉసేని , ముఖ్య నాయకులు మరియు హుస్సేన్ కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఉన్నారు.

# 'ఇస్కఫ్' జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:**
భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) నంద్యాల జిల్లా ప్రథమ మహాసభను ఈనెల 24 (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్మాణ బాధ్యులు పి. మురళీధర్. ఎస్ రియాజ్ లు వెల్లడించారు.



నంద్యాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇస్కఫ్ నంద్యాల జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగా శ్రీధర్ రావు, గౌరవ అతిథులుగా సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.వి. శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి కె. వసంత బాబులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1941లో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయ నాయకుల ఆధ్వర్యంలో 'ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్' పేరుతో ప్రారంభమైన ఈ సంస్థకు 84 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న యుద్ధోన్మాదం, ఉగ్రవాదం, పర్యావరణ కాలుష్యం, మానవ హక్కుల ఉల్లంఘన, క్షీణిస్తున్న సాంస్కృతిక విలువలపై ప్రజలను చైతన్య పరచడమే ఇస్కఫ్ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, స్నేహభావం కోసం పనిచేస్తున్న ఈ సంస్థ జిల్లా ప్రథమ మహాసభ ద్వారా ప్రస్తుత సామాజిక సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. ఈ మహాసభను విజయవంతం చేయడానికి నంద్యాల జిల్లాలోని మేధావులు, విద్యావంతులు, యువత, విద్యార్థులు, ప్రజానీకం అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# జిల్లా బిజెపి కార్యాలయంలో జనవారధి కార్యక్రమం.

**దరఖాస్తులను స్వీకరించిన జిల్లా బిజెపి అధ్యక్షులు అభివృద్ధి మధు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 22:** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధి బిజెపి జనతా వారధి నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జనతా వారిది కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి నంద్యాల సీనియర్ నాయకులు మాజీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కశెట్టి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 5 మంది నిరుపేద వికలాంగుల సమస్య 3 చక్రాల బ్యాటరీ సైకిల్ కావాలని జనతా వారధి దగ్గరకు వచ్చి వినతిపత్రం ఇవ్వడమైనది, బైర్మల్ స్ట్రీట్ లో నివాసముంటున్న రోజువారి కూలీలకు వెళ్లే 8 మంది మహిళా మణులు వారికి ఇంటి స్థలాలు మరియు ఇండ్లు కేటాయించాలని వినతిపత్రం ఇవ్వడమైనది వారి నుంచి అర్జీలు స్వీకరించడం అయినది. స్వీకరించిన అర్జీలను సోమవారం జరుగు పిజిఆర్ఎస్ లో సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుంది. సమస్య పరిష్కారమయ్యేంతవరకు జనతావారధి అండగా నిలుస్తుంది ఈ కార్యక్రమంలో పసపుల రవికుమార్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్ జిల్లా కన్వీనర్,ఋషి కుమార్ రెడ్డి క్రాంతి నగర్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.